క్లుప్తంగా

శ్మశాన ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన



పెనమలూరు: గంగూరు గ్రామంలో శ్మశానవాటిక ప్రహరీ నిర్మాణానికి ఎమ్మెల్యే బోడె ప్రసాద్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. గ్రామంలో శ్మశానవాటికకు ప్రహరీ లేక పోవటంతో సమస్యలు తలెత్తుతున్నాయని గ్రామస్తులు పాలకుల దృష్టికి తీసుకు వచ్చారు. దీంతో రూ.14 లక్షలు గ్రామ పంచాయతీ నిధులతో శ్మశానవాటికకు ప్రహరీ నిర్మించటానికి శంకుస్థాపన చేశారు. దాదాపు ఐదు కులాల వారికి ఈ శ్మశాన వాటిక ఉపయోగపడుతుందని పాలకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఆర్ డీఈ శ్రీనివాస్, టీడీపీ నేతలు అక్బర్‌పాషా, కోయా ఆనంద్, అనుమోలు ప్రభాకర రావు, బాషా, పలువురు పాల్గొన్నారు.

500 మంది మహిళలకు వైద్య పరీక్షలు



రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం ప్రసాదంపాడులో శుక్రవారం అన్నపూర్ణ ట్రస్ట్ ఆధ్వర్యంలో సుమారు 500 మంది మహిళలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. గ్రామంలోని వికాస్ స్కూల్ రోడ్డులోని ట్రస్ట్ కార్యాలయంలో పలు గ్రామాల నుంచి వచ్చిన వారికి మహిళ సంబంధిత వ్యాధులతో పాటు సుగరు, రక్తపోటు, థైరాయిడ్ వంటి వ్యాధులకు వైద్యులు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. వైద్యులు పి. రమాకాంత్ భార్గవ్, గాయత్రి స్త్రీలలో వచ్చే పలు రకాల క్యాన్సర్లపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ వ్యవస్థాపకురాలు టి.జ్యోతి కుమారి, తదితరులు పాల్గొన్నారు.

బాలికల సంరక్షణ అందరి బాధ్యత



కంకిపాడు: బాలికల సంరక్షణ అందరి బాధ్యత అని ఐసీడీఎస్ కంకిపాడు ప్రాజెక్టు సీడీపీఓ కేబీ సుకన్య అన్నారు. కిశోరి వికాసం మండల స్థాయి శిక్షణ కార్యక్రమం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. సీడీపీఓ సుకన్య మాట్లాడుతూ చిన్నారులు, బాలికలపై దాడులను నిరోధించాలన్నారు. లైంగిక దాడులు జరగకుండా వారికి అవసరమైన రక్షణ కల్పించాలన్నారు. మెరుగైన విద్యనందించాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని తెలిపారు. బాలికలకు అండగా నిలవాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎస్.బసవయ్య, సూపర్‌వైజర్ ఎస్.అన్నామణి, పలువురు మహిళా సంరక్షణ కార్యదర్శులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రీసెర్చ్ అకాడమీతో ఒప్పందం



పెనమలూరు: గంగూరు ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీ పాండిచ్చేరికి చెందిన ఎంఎస్‌హెచ్ రీసెర్చ్ అకాడమీతో శుక్రవారం అవగాహన ఒప్పందం చేసుకుంది. ఈ మేరకు కాలేజీ డైరెక్టర్ రవిప్రసాద్ వివరాలు వెల్లడించారు. వీఆర్ ఎడ్యుకేర్ సౌజన్యంతో ఎంఎస్‌హెచ్ రీసెర్చ్ అకాడమీ ఎండీ రాజాసంతోష్‌తో అవగాహన ఒప్పందం చేసుకున్నామన్నారు. దీని ద్వారా కాలేజీలో ఆగస్టు మొదటి వారంలో అంతర్జాతీయ కాన్ఫరెన్స్ నిర్వహిస్తామన్నారు. ప్రతిభావంతమైన పరిశోధన పత్రాలు రచన, వర్క్‌షాపు, వనరుల భాగస్వామ్యం పేటెంట్ ఫైలింగ్ సంబంధించి కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో కాలేజీ కార్యదర్శి భవాని ప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కడియాల రవి, డీన్ డాక్టర్ సత్యప్రసాద్, ప్రొఫెసర్లు రాజేష్ గోగినేని, డాక్టర్ సౌమ్య కోనేరు పలువురు పాల్గొన్నారు.

పాఠశాలకు ఎక్సలెన్స్ అవార్డు



పెనమలూరు: పోరంకి రవీంద్ర భారతి పాఠశాలకు ప్రతిష్టాత్మకమైన ఇండియా ఎలైట్ ఎడ్యుకేషన్ అండ్ ఇనిస్టిట్యూషనల్ ఎక్సలెన్స్ అవార్డు వచ్చింది. ఫ్యూచరిస్టిక్ అండ్ ప్రామిసింగ్ స్కూల్ ఆఫ్ ది ఇయర్- 2025 ఏపీ క్యాటగిరీలో అవార్డు వచ్చింది. నాణ్యమైన విద్య, ఉత్తమ పాలన, అత్యున్నత మౌలికవసతులు కల్పించినందుకు ఈ గౌరవాన్ని గ్రీన్ స్కూల్ అందుకుందని యాజమాన్యం తెలిపింది. శుక్రవారం బెంగుళూరులో అవార్డును ప్రిన్సిపాల్ అపర్ణ అందుకున్నారు.

పేరంటాళ్ల చెరువు ప్రక్షాళన పట్టదా?

- గ్రామంలో మురుగు చెరువులోకే..
- అధ్వానంగా మారిన చెరువు
- ఉపాధి కోల్పోతున్న మత్స్యకారులు



పెనమలూరు పేరంటాళ్ల చెరువు



డ్రెయినేజీలు లేక రోడ్డుపై నిలిచిన మురుగు నీరు (ఫైల్)

పెనమలూరు: పెనమలూరు గ్రామస్తులకు పూర్వం ఎంతగానో ఉపయోగపడిన పేరంటాళ్ల చెరువు ప్రక్షాళన జరిగేనా అనే ప్రశ్న తలెత్తుతోంది. ఈ చెరువు ప్రస్తుతం పూర్తిగా కలుషితంగా మారి అధ్వానంగా ఉంది. చెరువు పరిస్థితులు మత్స్యకారులు సాగు చేయలేని విధంగా ఉండటంతో చాలా మంది మత్స్యకారులకు ఉపాధి లేకుండా పోయింది.

వివరాల్లోకి వెళితే..

పెనమలూరు గ్రామంలో దాదాపు 15 ఎకరాల్లో పేరంటాళ్ల చెరువు ఉంది. ఒకప్పుడు ఈ చెరువులో నీరు గ్రామస్తులకు ఉపయోగపడేది. పండగలు వస్తే మహిళలు చెరువు వద్ద కార్యక్రమాలు చేసేవారు. రైతులు కూడా చెరువు నీరుతోనే వ్యవసాయ సాగు చేసేవారు.

కలుషితమైన చెరువు..

అయితే పెనమలూరు గ్రామం విస్తరించటం, డ్రెయినేజీ వ్యవస్థ లేక పోవటంతో ఈ చెరువుకు గ్రహణం పట్టుకుంది. గ్రామంలో మురుగునీరంతా నేరుగా చెరువులోకి చేరి చెరువు పూర్తిగా కలుషితమైంది. వర్షం పడితే గ్రామంలోని మురుగునీరు, వర్షం నీరు ప్రధాన రహదారి మీదగా ప్రవహించి చెరువులోకి చేరుతుంది. రహదారులు కూడా మోకాలు లోతు నీటిలో మునిగిపోతున్నాయి. గ్రామంలో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారటంతో చెరువు మనుగడ ప్రశ్నార్థకంగా మారింది.

మత్స్యకారులకు ఉపాధి కరువు..

పెనమలూరు పేరంటాళ్ల చెరువు మత్స్యకారులకు ఉపాధి కల్పించేది. మత్స్యకారుల సొసైటీ చెరువును లీజుకు తీసుకొని చేపలసాగు చేసేవారు. అయితే చెరువు కలుషితంగా మారటంతో చెరువులో ఉన్న చేపలు చనిపోవటంతో మత్స్యకారులకు నష్టం జరుగుతోంది. వారికి ఉపాధి లేకుండా పోయింది. దాదాపుగా అన్ని చెరువులు ఇదే పరిస్థితిలో ఉండటంతో మత్స్యకారులకు జీవనోపాధి లేకుండాపోయింది.

డ్రెయినేజీ నిర్మాణానికి చర్యలు..

చెరువును ప్రక్షాళన చేయటానికి డ్రెయినేజీ నిర్మాణం చేయటానికి చర్యలు చేపట్టారు. చెరువు వద్ద నుంచి అంబేడ్కర్‌కాలనీ వరకు డ్రెయినేజీ నిర్మాణం చేసి మురుగునీరు మళ్లించటానికి యత్నాలు చేస్తున్నారు. రూ.50 లక్షలతో డ్రెయినేజీల నిర్మాణం పనులు చేపట్టారు. అయితే డ్రెయినేజీ నిర్మాణం చేస్తే మురుగునీరు అంబేడ్కర్‌కాలనీ వరకు పారుదల సక్రమంగా జరుగుతుందా లేదా అని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. డ్రెయినేజీ నిర్మాణంలో లెవల్స్ సక్రమంగా ఉంటేనే నీరు పారుదల జరుగుతుంది. ఇక అంబేడ్కర్‌కాలనీ నుంచి పంట పొలాల మీదగా మురుగునీరు ఏనుగుల కోడు డ్రెయిన్‌లోకి వెళ్లాల్సి ఉంటుంది. అంత దూరం మురుగునీరు పారుదల సక్రమంగా జరుగుతుందా అని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనా చెరువు ప్రక్షాళన చేసి మత్స్యకారులకు ఉపాధి కల్పించి, గ్రామంలో అనారోగ్య వాతావరణం నుంచి గ్రామస్తులను విముక్తి కల్పించాల్సి ఉంది.

చెరువు ప్రక్షాళన చేయాలి..



పేరంటాళ్ల చెరువు ప్రక్షాళన చేయాలి. చెరువులో డ్రెయినేజీ నీరు రాకుండా చర్యలు తీసుకోవాలి. చేపల సాగుకు పరిస్థితులు అనుకూలంగా మార్చాలి. చాలా మంది మత్స్యకారుల కుటుంబాలు చెరువులో చేపల సాగుపై ఆధారపడి ఉన్నాయి. – అంద్రాజు వీర్రాజు, మత్స్యకారుల సొసైటీ అధ్యక్షుడు, పెనమలూరు

డ్రెయినేజీల నిర్మాణం



చెరువులోకి మురుగునీరు వెళ్ల కుండా డ్రెయినేజీల నిర్మాణం చేపట్టాం. భవిష్యత్తులో చెరువులోకి మురుగునీరు వెళ్లదు. మత్స్యకారులు చేపల సాగు చేసుకునే విధంగా అవకాశాలు కల్పిస్తాం. – లింగాల భాస్కరరావు, సర్పంచి, పెనమలూరు

ధాన్యం కొనుగోలు చేయాలని రైతుల వినతి



నున్న లో ఆర్‌ఎస్‌కే వద్ద సిబ్బందిని ప్రశ్నిస్తున్న రైతులు

నున్న(విజయవాడరూరల్): రైతుల వద్ద నిల్వ ఉన్న ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని నున్న గ్రామ రైతులు శుక్రవారం రైతు సేవా కేంద్రం వద్ద డిమాండ్ చేశారు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం కోతలు కోసి, ఆరబెట్టి, సంచుల్లో నిల్వబెట్టిన ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం లారీలను పంపడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రోజుల తరబడి ధాన్యం నిల్వ ఉన్నా పట్టించుకునే నాధుడే లేరని, జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ నున్న గ్రామం వచ్చి రైతుల వద్ద నిల్వ ఉన్న ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని సంబంధిత సివిల్ సప్లయిస్ అధికారులకు చెప్పినా సరైన స్పందన లేదన్నారు. ధాన్యం కొనుగోలు చేయాలని గ్రామంలో వ్యవసాయ, కోపరేటివ్ సొసైటీ, రెవెన్యూ అధికారుల వద్దకు కాళ్లరిగేలా తిరుగుతున్నా రవాణా చేసేందుకు లారీలు రావడంలేదని, సంచులు పంపక పోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నట్లు రైతులు తెలిపారు. ఎండల్లో ఎక్కువ రోజులు ధాన్యం నిల్వ ఉండటం వల్ల ధాన్యం ముక్కవుతోందని, దాంతో రైస్‌మిల్లు యాజమాన్యం కొనుగోలుకు ఆసక్తి చూపడం లేదని చెబుతున్నారు. ప్రభుత్వం గిట్టుబాటు ధరకు రైతుల వద్ద నిల్వ ఉన్న ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులు గుంటక హనుమారెడ్డి, దర్శి గోపి, అవుతు కోటిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చెరువులో రోడ్డు నిర్మాణానికి వ్యతిరేకంగా తీర్మానం

సాక్షి స్పందన

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం ఎనికేపాడు పంచాయతీ కార్యాలయం వెనుక చెరువు ఆక్రమణకు ప్రణాళికలు రూపొందిస్తున్నారని వివరిస్తూ ' చెరువు ఆక్రమణకు స్కెచ్' శీర్షికన శుక్రవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి స్పందన వచ్చింది. టీడీపీ నాయకుల స్వార్థ ప్రయోజనాలు కోసం తమ పొలాల ధరలు పెంచుకునేందుకు, కమర్షియల్ నిర్మాణాలు సాగించేందుకు చెరువులో నుంచి రోడ్డు వేయాలనే అంశాన్ని బోర్డు సమావేశంలో చేర్చారని కథనం ద్వారా గ్రామస్తులు, పాలకవర్గ సభ్యులకు తెలియజెప్పింది. ఈ అంశం తీర్మానం పొందితే కోట్ల విలువైన సంపద టీడీపీ నాయకులకు దోచి పెట్టినట్లు అవుతుందని వివరించింది. దీంతో పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన పాలకవర్గ సమావేశంలో వార్డు సభ్యులు చెరువులో రోడ్డు అంశాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ అంశం కేవలం పొలాల యజమానులు, కమర్షియల్ నిర్మాణాలు సాగించేవారికి అనుకూలంగా ఉందంటూ అభ్యంతరం వెలుబుచ్చారు. చెరువు స్థలం అన్యాక్రాంతమైతే చూస్తూ ఊరుకోమని పలువురు హెచ్చరించారు. చెరువు చుట్టూ ఫెన్సింగ్ నిర్మించి కాపాడాలని డిమాండ్ చేశారు. దీంతో మెజార్టీ వార్డు సభ్యులు వ్యతిరేకించడంతో ఈ అంశం తీర్మానం పొందలేదు. గ్రామంలో పలుచోట్ల జాతీయ నాయకుల విగ్రహాల ఏర్పాటు అంశాన్ని వాయిదా వేశారు. 2025- 26 సంవత్సరాలకు గానూ గ్రామంలో పారిశుద్ధ్య పనులు నిర్వహించేందుకై తక్కువ ధరకు టెండర్ వేసిన ఎత్తిర శ్రీనివాస్ టెండర్‌ను పాలకవర్గ సభ్యులు ఆమోదించారు. సుమారు రూ.40 లక్షలతో గ్రామంలో పలు చోట్ల డ్రెయిన్ల నిర్మాణ అంశాన్ని కూడా తీర్మానించారు. గ్రామ సర్పంచ్ రాచమళ్ల పూర్ణచంద్రరావు, కార్యదర్శి విద్యాధర్, వార్డు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

పంచాయతీ చెరువుపోరంబోకు భూమి ఆక్రమణ



చెరువు పోరంబోకు స్థలంలో నిర్మిస్తున్న అక్రమ కట్టడం

కేసరపల్లి(గన్నవరం): కేసరపల్లిలో గ్రామంలో ఇప్పటికే అనేక ప్రభుత్వ భూములు అక్రమణలకు గురికాగా, తాజాగా బీసీ కాలనీలోని చెరువు పోరంబోకు భూమిలో రాత్రిరాత్రికి కట్టడాలు వెలిశాయి. జనసేన పార్టీకి చెందిన నాయకుడే ఈ అక్రమ కట్టడాలను పాల్పడడం గమనార్హం. వివరాలిలా ఉన్నాయి. గ్రామంలోని బీసీ కాలనీలోని చెరువు పోరంబోకు భూమిలో ఉన్న తాగునీటి బావి కాలక్రమంలో పూడుకుపోయింది. గతంలో ఈ స్థలాన్ని మెరక చేసి కొంత మంది ఆక్రమించేందుకు ప్రయత్నాలు చేయగా గ్రామస్తులు అడ్డుకోవడంతో నిలిచిపోయింది. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో జనసేన గ్రామ పార్టీ అధ్యక్షుడు సుదాబత్తుల రామకృష్ణ కన్ను సదరు స్థలంపై పడింది. గుట్టుచప్పుడు కాకుండా స్థలం కబ్జాకు ప్రయత్నాలు ప్రారంభించాడు. గురువారం రాత్రి ఆ స్థలంలో సిమెంట్ దిమ్మలు పాతి నిర్మాణ పనులు బయటకు కనిపించకుండా చుట్టూ గ్రీన్ మ్యాట్ ఏర్పాటు చేశారు. ఈ అక్రమ కట్టడం గురించి పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఈ స్థలం ఖరీదు సుమారు రూ.15 లక్షల వరకు ఉంటుందని చెబుతున్నారు. ఇప్పటికైనా అక్రమ కట్టడాలను తొలగించకపోతే ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని గ్రామస్తులు హెచ్చరిస్తున్నారు.

ఆక్రమణలు తొలగిస్తాం..

బీసీ కాలనీలో రోడ్డు పక్కన గ్రామ పంచాయతీకి సంబంధించిన స్థలంలో అక్రమ కట్టడాలను గుర్తించాం. పంచాయతీ సిబ్బందితో శనివారం ఈ అక్రమ కట్టడాలను కూల్చివేస్తాం. అవసరమైతే ఆక్రమణకు పాల్పడిన వ్యక్తులపై చట్ట పరమైన చర్యలకు కూడా సిద్ధంగా ఉన్నాం.
– ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి, కేసరపల్లి

బేడ, బుడగ జంగాల అభ్యున్నతికి చర్యలు తీసుకోవాలి



ఐక్య నినాదాలు చేస్తున్న బేడ, బుడగ జంగాల ప్రతినిధులు

కంకిపాడు: బేడ, బుడగ జంగాల అభ్యున్నతికి పాలకులు చర్యలు తీసుకోవాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. కంకిపాడులోని శ్రీ కృష్ణ కల్యాణ మండపంలో ఆలిండియా బీబీజే మూడో వార్షికోత్సవ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. వేడుకల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటుగా కర్నాటక, తమిళనాడు, మహారాష్ట్ర రాష్ట్రాలకు చెందిన సంచార జాతులు బేడ, బుడగ జంగాల ప్రతినిధులు హాజరై సమస్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆలిండియా బీబీజే ముఖ్య సలహాదారు కొండపల్లి దుర్గారావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బేడ, బుడగ జంగాలను ఎస్సీలుగా గుర్తిస్తూ కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆ జీఓను సమర్థంగా అమలు చేసి త్వరితగతిన తగు సంక్షేమ చర్యలు తీసుకోవాలన్నారు. కులధ్రువీకరణ పత్రాలు జారీ చేయటంలో తాత్సారం చేస్తున్నారని వాపోయారు. సంస్థాగతమైన సమస్యలను పరిష్కరించి, బేడ, బుడగ జంగాల అభ్యున్నతికి చర్యలు తీసుకోవాలని కోరారు. సంఘం ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర అధ్యక్షుడు బిలపాటి తుకారం, అధికార ప్రతినిధులు సిరిగిరి విజయ్, పత్తి తిరుపతిరావు, తూరపాటి మొగులయ్య, గౌరవ అధ్యక్షుడు మోతేభిక్షం, తెలంగాణ రాష్ట్ర ప్రతినిధి మొతేబాలు, ఏపీ ప్రతినిధులు విబూది జ్యోతిబాబు, రుద్రాక్షల ఈశ్వరరావు, సంకుల శ్రీనివాసరావు, వనం సాంబయ్య, కోశాధికారి తూరపాటి మారేష్, ఏలూరు జిల్లా అధ్యక్షుడు పురాణం మారయ్య, కోఆర్డినేటర్ సంకుల మహాలింగప్ప, మిరియాల వెంకట్ పాల్గొన్నారు.

నడి రోడ్డుపై వీరంగం వేసిన వ్యక్తికి దేహశుద్ధి

పెనమలూరు: కానూరులో ఒక వ్యక్తి నడిరోడ్డుపై వీరంగం సృష్టించి, మరో కారు యజమానిపై దాడి చేసి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించటంతో స్థానికులు అతనికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడ లబ్బీపేటకు చెందిన మొహమ్మద్ ఖలీల్ స్క్రాప్ వ్యాపారం చేస్తాడు. అతను గురువారం రాత్రి తన కారులో కానూరు అశోక్‌నగర్‌లో ఉంటున్న బావ అబ్దుల్లా బేగ్ ఇంటికి బయలుదేరాడు. కారు సిరీస్ కంపెనీ వద్దకు రాగా ఎదురుగు వెళుతున్న మరో కారు నడుపుతున్న వ్యక్తి సడన్ బ్రేక్ వేశాడు. దీంతో ఖలీల్ కారు ఎదురుగా బ్రేక్ వేసిన కారుకు తగిలింది. దీంతో కారులో ఉన్న గొర్రిపాటి నాగకోటేశ్వరరావు కారు నుంచి దిగి వచ్చి ఖలీల్ కారుపై దాడి చేశాడు. కారు అద్దాలు ధ్వంసం చేశాడు. ఖలీల్‌పై దాడి చేశాడు. అడ్డుగా వచ్చి పోలీసులపై కూడా దాడికి దిగాడు. నడి రోడ్డుపై గొర్రిపాటి నాగకోటేశ్వరరావు వీరంగం వేస్తూ బీభత్సం సృష్టించి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించి దాడికి దిగటంతో స్థానికులు అతనిని పట్టుకున్నారు. వారిపై కూడా తిరగబడటంతో దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

పాడి పశువుల వైద్య సేవలకు ప్రత్యేక యాప్

హనుమాన్‌జంక్షన్ రూరల్: పాడి పశువులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు 'విజి వెటకేర్' పేరుతో ప్రత్యేక యాప్‌ను రూపొందించినట్లు కృష్ణా మిల్క్ యూనియన్ ఎండీ కొల్లి ఈశ్వరబాబు శుక్రవారం తెలిపారు. ప్రపంచ వెటర్నరీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ యాప్‌ను శనివారం ఆవిష్కరించనున్నట్లు చెప్పారు. బాపులపాడు మండలం వీరవల్లిలోని ప్రాజెక్టు కామధేను పాల ఉత్పత్తుల కార్మాగారం ఆవరణలో 'విజి వెటకేర్' యాప్ ఆవిష్కరణ కార్యక్రమం కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు చేతుల మీదగా జరుగుతుందని వివరించారు. ప్రతి పాడి పశువుకు సెమన్, వ్యాక్సిన్స్, వ్యాధులు, వైద్య సేవల పూర్తి సమాచారం ఈ యాప్‌లో నిక్షిప్తం చేయనున్నట్లు పేర్కొన్నారు. పాడి రైతులకు పశువుల ఆరోగ్య సమాచారాన్ని ముందస్తుగా తెలియచేసేందుకు ఆస్కారం ఉంటుందన్నారు.

ఉగ్రదాడికి నిరసనగా ర్యాలీ

హనుమాన్‌జంక్షన్ రూరల్: జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో పర్యాటకులపై ఉగ్రదాడుల దాడికి నిరసనగా బాపులపాడు మండలం బండారుగూడెంలో శుక్రవారం ప్రదర్శన నిర్వహించారు. గ్రామంలోని వీధుల్లో ప్లకార్డులు పట్టుకుని ర్యాలీ చేశారు. ఉగ్రదాడిలో మృతి చెందిన వారి ఆత్మకు శాంతి చేకూరని ప్రార్థించారు. పహల్గామ్‌లో టెర్రరిస్టుల దాడి పిరికిపంద చర్యగా పేర్కొన్నారు. సీపీఎం నాయకుడు లెనిన్, పరిమి రాకేష్, కలతోటి చిన్న చెన్నయ్య పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈఈ ఆపరేషన్స్ పి.హరిబాబు తెలిపారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ శనివారం కెనాల్ బండ్ ఫీడర్ మరమ్మతుల కారణంగా ఉదయం 7.30 గంటల నుంచి 10.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుతామన్నారు. డొంకరోడ్డు, కమ్మిలి వెంకటస్వామి వీధి, షిరిడి సాయిబాబానగర్, హైదర్‌నగర్, ఇందిరానగర్ 2 పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

హనుమాన్‌జంక్షన్ రూరల్: హనుమాన్‌జంక్షన్ బైపాస్ రోడ్డు వద్ద శేరినరసన్నపాలెంలో నూతనంగా నిర్మించిన మెడి వ్యాలీ మల్టీ స్పెషాలిటీ హాస్పటల్స్‌లో ఈ నెల 27వ తేదీన ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు ఆస్పత్రి చైర్మన్ పంచకర్ల వరప్రసాద్, ఎండీ చక్రవర్తి శుక్రవారం తెలిపారు. ఉచితంగా వైద్య పరీక్షలు, అవసరమైన మందులు పంపిణీ చేయనున్నట్లు వివరించారు.

రోడ్డు ప్రమాదంలో అన్నాచెల్లికి గాయాలు

పెనమలూరు: పెనమలూరు గ్రామంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో అన్నాచెల్లెలికి గాయాలవ్వటంతో పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. సీఐ వెంకటరమణ తెలిపిన వివరాలు.. చోడవరం గ్రామానికి చెందిన యలమంచిలి హిమశ్రీ, ఆమె సోదరుడు యలమంచిలి సిద్ధార్థసాయివెంకట్ ఇంజినీరింగ్ చదువుతున్నారు. హిమశ్రీ గంగూరు ధనేకుల కాలేజీలో ద్వితీయ సంవత్సరం, అన్న కానూరు పీవీపీ సిద్ధార్థకాలేజీలో ఫైనల్ ఇయర్ బీటెక్. ఇద్దరూ బైక్‌పై గురువారం బయలుదేరి చోడవరంలో ఇంటికి వెళుతుండగా పెనమలూరు పెద్ద గుడి మలుపు వద్ద ఎదురుగా వచ్చిన ట్రాక్టర్ ఢీ కొట్టింది. దీంతో ఇద్దరు రోడ్డుపై పడిపోవటంతో గాయాలయ్యాయి. పోరంకిలో ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆలయ పునర్నిర్మాణానికి రూ.లక్ష విరాళం

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం సింగన్నగూడెంలోని శ్రీగంగా పార్వతి సమేత సోమేశ్వరస్వామి దేవస్థానం పునర్నిర్మాణానికి నాగార్జున సాగర్ ఎడమ కాలువ ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు, మాజీ సర్పంచ్ మణికృష్ణ దంపతులు రూ.లక్ష విరాళాన్ని అందించారు. ఈ మొత్తాన్ని ఆలయ పునర్నిర్మాణ కమిటీ అధ్యక్షుడు కొట్టే రాజ కోటేశ్వరరావు, సర్పంచ్ కసుకుర్తి రంగామణి, ఉప సర్పంచ్ బెజవాడ వెంకట కృష్ణారావులకు శుక్రవారం అందజేశారు.

పంటల వ్యర్థాల సేకరణ బృందం సందర్శన



గంగూరు రైతుసేవా కేంద్రంలో వ్యవసాయ అధికారులతో మాట్లాడుతున్న సభ్యులు

పెనమలూరు: పంటల వ్యర్థాలతో బయో ఫ్యూయల్ తయారు చేసే 'సెల్' కంపెనీ ప్రతినిధులు శుక్రవారం మండలంలో పర్యటించారు. బృందం సభ్యులు గంగూరు రైతు సేవా కేంద్రాన్ని సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. బృందం సభ్యులు మాట్లాడుతూ 13 రాష్ట్రాలలో బయో ఫ్యూయల్ తయారు చేసే యూనిట్లు ఉన్నాయన్నారు. ఏపీలో కూడా యూనిట్ ఏర్పాటుకు పరిశీలిస్తున్నామని వివరించారు. బయో ఫ్యూయల్‌కు వరి, జొన్న, మొక్క జొన్న, తదితర పంటల నుంచి వచ్చే వ్యర్థాలను కిలో రూ.2 చొప్పున రైతులకు చెల్లించి సేకరిస్తామన్నారు. రైతులు పండించిన పంటలు అమ్మకాలు చేసిన తరువాత వ్యర్థాలను పంట పొలాల్లో తగుల పెడుతున్నారని, దీని వలన రైతులకు ఉపయోగం లేదన్నారు. రైతులు సహకరిస్తే వ్యవసాయ వ్యర్థాలను సేకరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బృంద సభ్యులకు నాయకత్వం వహించిన కార్మాసింగ్, ఏడీఏ ఎం.సునీల్, మండల వ్యవసాయాధికారి కనకమేడల శైలజ, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాధుల నియంత్రణపై అవగాహన



కరపత్రాలు పంచుతున్న పంచాయతీ కార్యదర్శి రాజేంద్రప్రసాద్, సిబ్బంది



ఉప్పలూరు పీహెచ్‌సీ వద్ద ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

రామవరప్పాడు: దోమ కాటు వల్ల మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, మెదడువాపు, బోద వంటి అనేక వ్యాధులు వ్యాప్తి చెందుతాయని, వీటి పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలని పంచాయతీ కార్యదర్శి రాజేంద్రప్రసాద్ సూచించారు. విజయవాడ రూరల్ మండలం ప్రసాదంపాడులో శుక్రవారం జాతీయ కీటక జనిత వ్యాధుల నియంత్రణ కార్యక్రమంలో భాగంగా పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు తీసుకున్నారు. కరపత్రాలు పంచి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ నివాసాల మధ్య మురుగు నీరు నిల్వ లేకుండా జాగ్రత్త పడాలని సూచించారు. వ్యర్థాలు డంప్ చేయడానికి చెత్త కుండీలను వినియోగించాలన్నారు. దోమకాటుకు గురి కాకుండా దోమ తెరలు వినియోగించాలని సూచించారు.

మలేరియాపై అవగాహన ర్యాలీ

కంకిపాడు: మలేరియాను పూర్తిగా అంతమొందించే లక్ష్యంతో పని చేయాలని ఉప్పలూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సంతోష చంద్రిక అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా ఉప్పలూరు పీహెచ్‌సీ పరిధిలో అవగాహన ర్యాలీ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సంతోష చంద్రిక మాట్లాడుతూ దోమల నిర్మూలన చర్యలు తీసుకోవాలన్నారు. పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. గ్రామ పంచాయతీల సహకారంతో దోమల నిర్మూలన చర్యలను సమర్థంగా చర్యలు చేపడుతున్నామని వివరించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ అంజు, మలేరియా సబ్ యూనిట్ అధికారి జి.శ్రీనివాసరావు, ఎంపీహెచ్ ఈఓ కృష్ణారావు, పీహెచ్‌ఎస్ రాజమణి, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

గన్నవరంలో సత్య షోరూమ్ ప్రారంభం



షోరూమ్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న సంస్థ ప్రతినిధులు, ఉద్యోగులు

గన్నవరం: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన సత్యా షోరూమ్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ డీజీఎం సురేష్ మాట్లాడుతూ.. తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌లో తమకు 300కు పైగా షోరూమ్‌లు ఉన్నాయని చెప్పారు. ఏపీలో మాత్రం 54వ షోరూమ్‌గా గన్నవరంలో ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. తమ వద్ద గృహోపకరణాలపై 70 వరకు తగ్గింపు, ప్రతి కొనుగోలుపై తప్పనిసరిగా బహుమతులు అందించడం జరుగుతుందన్నారు. వేసవిలో ఏసీలు కొనుగోలుపై ప్రత్యేక తగ్గింపు ఇస్తామన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్థల యాజమానులు కాట్రగడ్డ సుబ్బారావు కుటుంబ సభ్యులు, సేల్స్ హెడ్ సెంథిల్, ఉద్యోగులు పాల్గొన్నారు.